క్లుప్తంగా

వివేకానంద పురస్కారాన్ని అందుకున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ: స్వామి వివేకానంద జీవన సాఫల్య పురస్కారాన్ని స్థానిక శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ గురువారం అందుకున్నారు. అనపర్తిలో జరిగిన కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ రాజమండ్రి అధ్యక్షుడు స్వామి పరిజ్ఞేయానందజీ మహరాజ్, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

నడక దారి లేదన్న ఫిర్యాదుపై అధికారుల పరిశీలన

పెడన: పట్టణంలోని కొత్తపేట రైలుగేటు సమీపంలో రైలు పట్టాల వెంబడి ఉంటున్న గృహాల్లో నివాసం ఉంటున్న వారికి రహదారి మార్గం లేక ఇబ్బందులు పడుతున్నామని గతంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుపై గురువారం పట్టణ ప్రణాళికా విభాగం టీపీవో సుజనాకుమారితో పాటు రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వాస్తవ పరిస్థితులను మ్యాప్ పాయింట్ ద్వారా ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని టీపీఓ తెలిపారు. కార్యక్రమంలో పట్టణ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ జితేంద్ర, ప్లానింగ్ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక దారుఢ్యం

కృత్తివెన్ను: ఆటల వల్ల శారీరక దారుఢ్యం మెరుగుపడి ఆరోగ్యంతో పాటు మానసిక దృఢత్వం కూడా పెరుగుతుందని పెడన శాసనసభ్యుడు కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. సంగమూడి ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో నియోజకవర్గ స్థాయి సబ్‌జోన్ ఆటల పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్, జెడ్పీటీసీ మైల రత్నకుమారి, స్థానిక నాయకులు కూనసాని వాసు, శ్రీనివాసరావు, ఏంఈవోలు వరప్రసాదరావు, త్రిపురసుందరీదేవి పాల్గొన్నారు.

రేపు పెడనలో విద్యుత్ అదాలత్

పెడన: నియోజకవర్గంలో పెడన సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ సమస్యలు ఏమైనా ఉంటే వాటిని అర్జీల రూపంలో అందజేసి పరిష్కరించుకోవాలని విద్యుత్‌శాఖ ఏఈడీ సీహెచ్‌ఆర్‌ఆర్ మాణిక్యాలరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 25న పెడన తోటమూల ఫంక్షన్ హాలులో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ అదాలత్‌లో పెడన నియోజకవర్గంలోని పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను ఈ మూడు మండలాల్లో కూడా ఏమైనా విద్యుత్ సమస్యలుంటే లిఖితపూర్వకంగా అర్జీల రూపంలో అందజేయాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

వాసవిలో జేఈఈ మెయిన్స్‌కు 299 మంది హాజరు

పెడన: జేఈఈ మెయిన్స్ పరీక్షలకు రెండో రోజు గురువారం పెడన మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో 299 మంది హాజరయ్యారని కేంద్రం అడ్మిన్ అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షకు 147 మందికి గాను 146 మంది హాజరయ్యారని, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరిగిన పరీక్షకు 158 మందికి 153 మంది హాజరయ్యారన్నారు.

350 మందికి వైద్య సేవలు

మచిలీపట్నంటౌన్: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని మెహర్‌బాబా ఆడిటోరియంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 350 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. దివ్య డయాగ్నిస్టిక్స్, అపోలో డయాగ్నిస్టిక్స్ సంస్థల సిబ్బంది షుగర్, బీపీ, కొలెస్ట్రాల్, విటమిన్, కాల్షియం తదితర పరీక్షలను ఉచితంగా చేశారు. విజయవాడకు చెందిన ఆరుష్ రుమటాలజీ, ఇమ్యూనాలజీ క్లినిక్ వైద్యురాలు చెన్నుపాటి యోగిత 150 మందికి బోన్ మినరల్ డెన్సిటీ పరీక్షలను ఉచితంగా చేశారు. కార్యక్రమాన్ని వాసవీ క్లబ్ ప్రతినిధులు యెండూరి సురేష్, శ్రీకాకోళపు రేణుకారాణి, వేముల శిరీష, అన్నం అశోక్, జల్లూరి దివ్యశ్రీ, రంగనాయకులు, తమ్మన అనురాధ తదితరులు పర్యవేక్షించారు.

విజ్ఞానంతో పాటు విలువలు నేర్పాలి

అవనిగడ్డ: విద్యతో పాటు విద్యార్థులకు ఆటలు, దేశభక్తి, విలువలు నేర్పించాలని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, ఎస్‌ఆర్‌ఐ తుంగల కళ్యాణ్ అన్నారు. స్థానిక శిశువిద్యా మందిరం స్కూల్ పూర్వవిద్యార్థి అయిన కళ్యాణ్‌ను గురువారం విజ్ఞాన విహార్ స్కూల్‌లో ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థి సంఘం కార్యదర్శి, పోస్టుమాస్టర్ సింహాద్రి రామలింగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కాశీభొట్ల నాగ సూర్యతేజ, ఉపాధ్యాయులు కాశీభొట్ల నాగభూషణం, మునగాల ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

జంతువులను ప్రేమించాలి

మచిలీపట్నంటౌన్ : ప్రతి ఒక్కరూ జంతువులను ప్రేమించాలని, వాటిని సంరక్షించేందుకు కృషి చేయాలని పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకుడు డాక్టర్ ఎస్.నాగభూషణబాబు సూచించారు. నగరంలోని రుస్తుంబాద మున్సిపల్ హైస్కూల్లో గురువారం జంతు సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు జంతు సంరక్షణకు సంబంధించిన చట్టాలను వివరించారు. జంతు సంక్షేమంపై విద్యార్థులకు క్విజ్ పోటీ నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రాంతీయ వైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ జేవీ రమణయ్య, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ టి.దీపక్ డేనియల్ పాల్గొన్నారు.

నెరవేరని ఆశయం

మూడు దశాబ్దాల కిందట అప్పటి పురపాలకులు సదుద్దేశంతో నిర్మించిన కూరగాయల మార్కెట్ ఎందుకూ కొరగాకుండా పోయింది. వారి ఆశయం నెరవేరలేదు. లక్షలు పెట్టి నిర్మించిన మార్కెట్ నిరుపయోగంగా మారడమే కాక, విషసర్పాలకు ఆలవాలమైంది.

- శిథిలావస్థలో సర్కారుతోట కూరగాయల మార్కెట్
- పగిలిపోయిన ప్రహరీ, పేరుకున్న చెత్తాచెదారం
- నిరుపయోగంగా మారి విషసర్పాలకు నిలయం



సర్కారుతోటలోని కూరగాయల మార్కెట్ దుస్థితి ఇది

కోనేరుసెంటర్: పురపాలక సంఘ పరిధిలోని సర్కారుతోటలో మూడు దశాబ్దాల కిందట నిర్మించిన మునిసిపల్ మార్కెట్ నిరుపయోగంగా మారింది. లక్షలు వెచ్చించి నిర్మించిన మార్కెట్‌పై అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో అది శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు ఏ గోడ కూలుతుందో తెలియని పరిస్థితిలో ఉంది. 33 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ మార్కెట్ ప్రారంభంలో కొద్ది రోజులు మినహా ఆ తరువాత వీటి సేవలు ప్రజలకు అందిన పాపానపోలేదు. దీంతో ఇది ఉన్నా ఉపయోగం లేకుండా పోయింది. లక్షలాది రూపాయలతో నిర్మించిన గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఏ క్షణాన కూలతాయో తెలియని స్థితిలో కనబడుతున్నాయి. చిలకలపూడిలో రోడ్లపై ఉండే చిరు వ్యాపారులకు కేటాయించి అద్దెలు వసూలు చేసి తద్వారా పురపాలక సంఘానికి ఆదాయాన్ని కల్పించాలనే సదుద్దేశంతో అప్పటి పాలకవర్గం ఈ మార్కెట్ నిర్మాణానికి పూనుకుంది. అనుకున్న సమయానికి నిర్మాణం పూర్తి చేయగా ఆనాటి ప్రజాప్రతినిధులు మార్కెట్ గదులను ఘనంగా ప్రారంభించారు. అయితే మార్కెట్ ప్రారంభం అయిన నాటి నుంచి నేటి వరకు చిలకలపూడిలో రోడ్లపై వ్యాపారాలు చేసే చిరు వ్యాపారులు ఏ ఒక్కరూ ఈ దుకాణాలు తీసుకునేందుకు ముందుకు రాకపోవటంతో గత 33 ఏళ్లుగా ఈ గదులు ఉండీ ఉపయోగం లేకుండా పోతున్నాయి.

విషసర్పాల సంచారం

గదులు నిరుపయోగంగా మారటంతో పాటు ఆ ప్రాంగణమంతా చెత్తాచెదారం, రాళ్ల రప్పలతో నిండిపోయింది. దీంతో రాత్రి వేళ విషసర్పాలు సంచరిస్తున్నాయి. రాత్రి వేళ రోడ్లపైకి వస్తూ ఒక్కోసారి ఇళ్లల్లోకి చొరబడుతున్నాయంటూ స్థానికులు వాపోతున్నారు.

పిల్లలకు క్రీడా మైదానంగా...

కూరగాయల మార్కెట్ నిరుపయోగంగా మారటంతో స్థానికంగా ఉన్న పిల్లలు ఉన్న కొద్దిపాటి ఖాళీ స్థలాన్ని క్రీడా మైదానంగా ఉపయోగించుకుంటున్నారు. పిచ్చిమొక్కల మధ్యే ఉదయం, సాయంత్రం ఆటలు ఆడుకుంటున్నారు. అయితే అక్కడ విషసర్పాలు ఉన్నాయని, పిల్లలకు ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

చినుకుపడితే చిత్తడే...

వర్షాకాలం వచ్చిందంటే మార్కెట్ సమీపంలోని స్థానికులకు కష్టాలు మొదలైనట్లే. చిన్నపాటి చినుకుపడితే చాలు మార్కెట్ ప్రాంగణమంతా మోకాలులోతు నీటిలో మునిగిపోతుంది. ఆ సమయంలో ఓ పక్క విషసర్పాలు, మరో పక్క దోమలతో కంటి మీద కునుకు లేకుండా చేస్తుంటాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌కు మరమ్మతులు చేపట్టి ఉపయోగంలోకి తీసుకురావాలని గత ఇరవై ఏళ్లుగా ఎంత మొరపెట్టుకున్నా ఏ ఒక్కరూ పట్టించుకోవటం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా గదులకు మరమ్మతులు చేపట్టి చిరువ్యాపారులకు అద్దెకు ఇస్తే పురపాలక సంఘానికి ఆదాయం పెరగటంతో పాటు తమ సమస్యలు తొలగిపోతాయని వారంటున్నారు.

జీజీహెచ్‌లో సమస్యలు పరిష్కరించండి

సూపరింటెండెంట్‌కు బీసీ సంఘం వినతి

మచిలీపట్నంటౌన్: స్థానిక సర్వజన ఆస్పత్రిలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆస్పత్రి సూపరింటెండెంట్ డి.ఆశాలతకు బి.సి సంక్షేమ సంఘం కృష్ణాజిల్లా శాఖ ప్రతినిధులు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు మాట్లాడుతూ ఆస్పత్రిలో గతంలో రోజుకు రెండు పూటలా ఓపీలో రోగులని పరీక్షించే వైద్యులు ప్రస్తుతం ఒక పూటకే పరిమితమయ్యారని ఆరోపించారు. ఆస్పత్రిలో మందులు ఇచ్చి ఫార్మసీ సిబ్బంది వాటిని ఏ విధంగా వాడాలో రాయకపోవడం వల్ల రోగులు ఒక మందుకు బదులు మరొక మందు మింగుతున్నారన్నారు. సదరం వికలాంగ ధ్రువీకరణ సర్టిఫికెట్ల జారీ రెండవ అంతస్తులో పెట్టడంతో, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫిజియో థెరపిస్ట్ లేకపోవటంతో పేద రోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. 108 అంబులెన్స్‌లో రోగులు ఆసుపత్రికి చేరుకున్నా వారిని ఆస్పత్రిలోకి తీసుకువెళ్లే సిబ్బంది లేకపోవడంతో వైద్యం ఆలస్యం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని సందర్భాల్లో రోగికి ప్రాణాపాయ స్థితి నెలకొంటోందన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సూపరింటెండెంట్‌కు బీసీ సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎస్.సుబ్రహ్మణ్యం, నాయకులు జోగి శివ, చేబోయిన కోటేశ్వరరావు, భోగిరెడ్డి సుభానీ, నీలపాల దుర్గా, ఎం.గోపి, బబ్బు, ఎం.పవన్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులను మోసం చేసిన చంద్రబాబు

పెడన: ఎన్నికలకు ముందు నారా చంద్రబాబునాయుడు నేత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తానని నమ్మబలికి ఇప్పుడు కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటూ చేనేత రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని సీపీఎం చేనేత విభాగం రాష్ట్ర నాయకుడు సజ్జా నాగేశ్వరరావు అన్నారు. ఆయన గురువారం తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 24న కృష్ణాజిల్లా చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు జరిగే ధర్నాలో జిల్లాలోని చేనేత కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్లో రూ.2వేల కోట్లు చేనేత రంగానికి కేటాయించాలని, చేనేతపై జీఎస్టీ పూర్తిగా రద్దు చేయాలని, చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత కరెంటును అమలు చేయాలని, నేతన్న నేస్తం మగ్గం నేస్తున్న ప్రతి చేనేత కార్మికునికి ఇవ్వాలని కోరారు.

ముగిసిన దరఖాస్తుల స్వీకరణ

142 పోస్టులకు దాదాపు 4,600 దరఖాస్తులు

మచిలీపట్నంటౌన్: స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, నర్సింగ్ కళాశాలల్లో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో పని చేసేందుకు వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. మొత్తం 27 రకాల ఉద్యోగాలకు సంబంధించి 142 పోస్టులకు దాదాపు 4,600 దరఖాస్తులు అందాయి. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 59, సర్వజన ఆస్పత్రిలో 75, నర్సింగ్ కళాశాలలో ఎనిమిది పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానించారు. దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని మెడికల్ కళాశాల కార్యాలయ సూపరింటెండెంట్ లక్ష్మణరావు పర్యవేక్షించారు.



నాగాయలంకలో నేతాజీకి ఘన నివాళి



నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న, నేతాజీ మిత్ర మండలి ప్రతినిధులు

నాగాయలంక: నేతాజీ యువజన సంఘం, సేవా సమితి ఆధ్వర్యంలో భారత స్వాతంత్య్ర సమరయోధుడు, ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని గురువారం స్థానిక బోసుబొమ్మ సెంటర్‌లో పరాక్రమ్ దివస్‌గా ఘనంగా జరిపారు. మాతృభూమి సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత దేశభక్తి పరాయణుడు సుభాష్ చంద్రబోసును నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని మండల తహసీల్దార్ ఎం.హరనాథ్ పిలుపునిచ్చారు. సేవా సమితి అధ్యక్షుడు లకనం నాగాంజనేయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత నేతాజీ విగ్రహానికి తహసీల్దార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళా సంఘం నాయకురాలు తలశిల స్వర్ణలత, ఎంపీడీఓ జె.సీతారామ్‌కుమార్, డీటీ అబ్దుల్ రఫీ, ఎంపీటీసీ సభ్యుడు లంకే శ్రీనివాస ప్రసాద్, రేవు సువర్ణరాజు, నాయుడు రమాదేవి, భట్టు జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

కేయూలో నేతాజీకి ఘన నివాళి

కోనేరుసెంటర్: ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు, స్వాతంత్య్ర సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ జయంతిని కృష్ణా విశ్వవిద్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి రెక్టర్ ఆచార్య ఎంవీ బసవేశ్వరరావు, రిజిస్ట్రార్ కె.శోభన్‌బాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరితో పాటు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని కలిసేందుకు వచ్చిన కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎంఎల్‌సీ అభ్యర్థి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, మాజీ ఎంఎల్‌సీ రామకృష్ణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేతాజీకి ఘన నివాళి

మచిలీపట్నంటౌన్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమాన్ని నేతాజీ మిత్ర మండలి ఆధ్వర్యంలో గురువారం నగరంలో ఘనంగా నిర్వహించారు. గొడుగుపేటలోని వెంకటేశ్వర కాంప్లెక్స్‌లో జరిగిన కార్యక్రమంలో నేతాజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మడమల రాంబాబు భాగవతార్, ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, రాష్ట్ర ముస్లిం సంక్షేమ అధికార ప్రతినిధి ఎండీ సద్‌రుద్దీన్ ఖురేషి, కూనపరెడ్డి బ్రహ్మయ్య , మైనంపూడి సాయిబాబు, విన్నకోట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సాహసానికి నిలువెత్తు నిదర్శనం నేతాజీ

కోనేరుసెంటర్: సాహసానికి నిలువెత్తు నిదర్శనం నేతాజీ సుభాష్‌చంద్రబోస్ అని అరిశేపల్లి గ్రామస్తులు అన్నారు. మండల పరిధిలోని అరిశేపల్లి పంచాయతీ పరిధిలోని చిట్టిపాలెం గ్రామంలో గురువారం నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గ్రామంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ నరిశెట్టి రత్తయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పల్లెపాలెంలో నేతాజీ జయంతి వేడుకలు

కృత్తివెన్ను: స్వాతంత్య్ర సమరయోధుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకలను స్థానిక పల్లెపాలెం ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎంఈవో వరప్రసాదరావు నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేశారు.

సంక్షిప్తంగా..

● 28న అవనిగడ్డ, పెడనలో జాబ్‌మేళా

అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 28న జాబ్‌మేళా కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.నరేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్, వైఎస్‌కే ఇన్‌ఫోటెక్, నవత ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలు పాల్గొననున్నట్టు చెప్పారు. 18 నుంచి 30 సంవత్సరాల లోపు ఉన్న పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ పూర్తిచేసిన వారు అర్హులన్నారు.మరిన్ని వివరాల కోసం 79955 34572, 63006 18985 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

పెడన: పట్టణంలోని శ్రీబొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 28న జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి విక్టర్‌బాబు, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ పి.నరేష్‌కుమార్ గురువారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఐటీఐ ఫిట్టర్, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 94404 44033 నంబరులో సంప్రదించాల్సిందిగా వారు సూచించారు.

● బాలుర సబ్‌జోన్ ఆటల పోటీలు ఆరంభం

తలగడదీవి(నాగాయలంక): స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో కృష్ణాజిల్లా 84వ వార్షిక సెకండరీ స్కూల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవనిగడ్డ సబ్‌జోన్ బాలుర ఆటల పోటీలు గురువారం అట్టహాసంగా ఆరంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే అండర్–17 సీనియర్ విభాగం కబడ్డీ, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీలను స్థానిక ఎంపీపీ భోగాది రమాదేవి, ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్యవైశ్య సోదరులు చిట్టా సాంబశివరావు, శివనాగేశ్వరరావుల దాతృత్వంతో అందించిన రూ.30వేల విలువైన క్రీడాదుస్తులను వారు విద్యార్థులకు అందజేశారు. సబ్‌జోన్ పోటీలకు మొత్తం 58 జట్లు హాజరయ్యాయి. పాఠశాల హెచ్ఎం బండ్రెడ్డి శివరామప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.హరనాథ్, సర్పంచి భోగాది వెంకటేశ్వరరావు, ఎంఈఓ టీవీఎన్ రామదాసు, ఎంపీడీఓ జె.సీతారామ్‌కుమార్, ఆరు మండలాల పి.డిలు, పీఈటీలు పాల్గొన్నారు.

● 26, 27 తేదీల్లో కోడూరులో రాష్ట్ర స్థాయి షటిల్ టోర్నమెంట్

కోడూరు: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కోట రాఘవయ్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 26,27 తేదీల్లో షటిల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కొరివి అనిల్‌కుమార్ గురువారం తెలిపారు. ఓపెన్, స్కూల్ స్థాయిలో ఈ పోటీలను విద్యాసంస్థల ప్రాంగణంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఓపెన్ స్థాయిలో మొదటి బహుమతిగా రూ.5వేలు, రెండవ బహుమతిగా రూ.3వేలు, స్కూల్‌స్థాయిలో మొదటి బహుమతిగా రూ.2వేలు, రెండవ బహుమతిగా రూ.వెయ్యి నగదు బహుమతులను అందివ్వనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు కచ్చితంగా పాఠశాల గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు. ఆసక్తి గలవారు 8639413241, 9505945571 నంబర్లను సంప్రదించాలని అనిల్‌కుమార్ తెలిపారు.

● రోడ్డు భద్రతతో ప్రమాదాల నివారణ

మచిలీపట్నంటౌన్: వాహనదారులు రోడ్డు భద్రత సూత్రాలను పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చునని జిల్లా రవాణా శాఖ అధికారి డి.సోనీప్రియ అన్నారు. నగరంలోని శ్రీ రామకృష్ణ పబ్లిక్ స్కూల్లో గురువారం రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు రోడ్డు భద్రతపై ఆమె అవగాహన కలిగించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రామకృష్ణ పాల్గొన్నారు.

● పూర్ణసాగర్‌కు మాజీ ఎమ్మెల్యే సింహాద్రి అభినందన

అవనిగడ్డ: అవనిగడ్డకు చెందిన దోవారి పూర్ణసాగర్‌ను వైఎస్సార్ సీపీ బూత్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా పూర్ణసాగర్‌కు మాజీ శాసనసభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి సింహాద్రి రమేష్‌బాబు, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ అభినందనలు తెలిపారు.

పశు వైద్యశిబిరాలను సద్వినియోగించుకోండి



పెదపాలెంలో పశువులకు వైద్యపరీక్షలు చేస్తున్న ఏడీ డాక్టర్ సాంబశివరావు

పెదపాలెం(నాగాయలంక): మండల పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పెదపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ సాయి మౌనిక నేతృత్వంలో గురువారం ఉచిత పశు వైద్య శిబిరం జరిగింది. గ్రామ సర్పంచ్ దున్న రాజేష్ కార్యక్రమాన్ని ప్రారంభించగా ముఖ్యఅతిథిగా అవనిగడ్డ పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ బి.సాంబశివ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా పశువులలో నట్టల నివారణ, గర్భకోశ వ్యాధులుకు చికిత్స, వ్యాధి నిరోధక టీకాలు నిర్వహించారు. ఏడీ పశువుల యజమానులతో మాట్లాడుతూ పశు వైద్యశిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. లింగ నిర్ధారణ వీర్యం, బహువార్షిత పశుగ్రాసాలు, పశుకిసాన్ కార్డు తదితర అంశాలపై అవగాహన కలిగించారు. సంబంధిత బ్రోచర్‌లను ఏడీ, సర్పంచ్, రైతుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. మండలంలోని మర్రిపాలెంలో 25న, 28న నాచుగుంట, 31న చోడవరం గ్రామాల్లో ఉచిత పశు వైద్య శిబిరాలు జరుగుతాయని డాక్టర్ చెప్పారు. అసిస్టెంట్ గోపీకృష్ణ, గ్రామస్తులు, రైతులు, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

పెడన మండలంలో...

పెడన: ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కొనకళ్ల బాబూరావు అన్నారు. మండలంలోని కొంకేపూడి, నడుపూరు గ్రామాల్లో గురువారం ఉచిత పశు వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పశువులకు నట్టల నివారణ మందు వేయడం, గర్భకోశ వ్యాధులు, జనరల్ చెకప్ వంటివి చేసి ఉచితంగా మందులను అందజేశామని ఏడీ తెలిపారు. ఉచిత పశువైద్య శిబిరాలు ఈ నెల 31వ తేదీ వరకు జరుగుతాయని, పాడి రైతులు ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. కార్యక్రమంలో శెలపాటి ప్రసాద్, మండల పశువైద్యాధికారి అల్తాఫ్ హుస్సేన్, జేఈవో సూరిబాబు, వీఏ రాజేశ్వరరావు, వీఎల్‌వో వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

నేడు చెన్నూరులో...

మండలంలోని మేజర్ పంచాయతీ చెన్నూరులో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరం జరుగుతుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా పశు వైద్యాధికారి అల్తాఫ్ హుస్సేన్ సూచించారు.

రామన్నపేటలో...

గూడూరు: మండలంలోని రామన్నపేటలో గురువారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. గూడూరు పశువైద్యాధికారి బి.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 30 గేదెలు, 27 గొర్రెలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. నట్టల నివారణ మందు వేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచి లుక్కా ఏలేషు, ధనేష్ తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలకు వైద్య సేవలు

కోనేరుసెంటర్: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం మచిలీపట్నం మండలం తాళ్లపాలెం గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని తాళ్లపాలెం గ్రామ సర్పంచ్ మధిరి అశ్విని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 400 గొర్రెలకు టీకాలు, 1000 గొర్రెలకు నట్టల నివారణ మందు, 30 దూడలకు, 30 పెద్ద పశువులకు నట్టల నివారణ మందు, 8 కృత్రిమ గర్భధారణలు, 20 తిరగబోర్లె పశువులకు, 30 పశువులకు సాధరణ వైద్య చికిత్సలు అందించినట్టు మండల పశువైద్య అధికారి దీపక్ డానియల్ తెలియజేశారు.

మోపిదేవిలంకలో...

మోపిదేవిలంక(మోపిదేవి): మోపిదేవిలంక, కోసూరువారిపాలెం గ్రామాల్లో పశువైద్య శిబిరాలను ఆయా గ్రామ సర్పంచ్‌లు మోర్ల జ్యోత్స్న, కోసూరు అనూష గురువారం ప్రారంభించారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ నందకిషోర్ పశువులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఎంపీటీసీ సభ్యురాలు దిడ్ల రాణి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మోర్ల శ్రీనివాసరావు, కొక్కిలిగడ్డ గ్రామ సర్పంచ్ దిడ్ల జానకీ రాంబాబు, పశు సంవర్ధకశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

26న వక్కలగడ్డలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

వక్కలగడ్డ(అవనిగడ్డ): చల్లపల్లి మండలం వక్కలగడ్డలో నూతనంగా ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఈనెల 26వ తేదీన జరుగుతుందని విగ్రహావిష్కరణ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 9 అడుగుల ఎత్తయిన ఈ విగ్రహాన్ని రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి ఉప్పులేటి దేవీప్రసాద్ ఆవిష్కరిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన బందరు, గుడివాడ డీఎస్పీలు



కలెక్టర్ డీకే బాలాజీని కలసి మొక్కను అందజేస్తున్న బందరు డీఎస్పీ చప్పిడి రాజా

చిలకలపూడి(మచిలీపట్నం): ఇటీవల జిల్లాలో బందరు, గుడివాడ డీఎస్పీలుగా నియమితులై బాధ్యతలు స్వీకరించిన చప్పిడి రాజా, ధీరజ్ వినీల్ గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ డీకే బాలాజీని ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలను అందజేశారు. వారిరువురికీ కలెక్టర్ బాలాజీ శుభాకాంక్షలు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సూచించారు.

దొంగను పట్టించిన సీసీ కెమెరాలు

అయ్యప్ప ఆలయంలో హుండీ అపహరించిన వ్యక్తి అరెస్టు

కోడూరు: దేవాలయంలో హుండీని అపహరించిన దొంగను సీసీ కెమెరాలు పట్టించాయి. ఎస్ఐ చాణిక్య తెలిపిన వివరాల ప్రకారం.. కోడూరు వీవర్స్ కాలనీలోని అయ్యప్ప స్వామివారి దేవాలయంలో ఈ నెల 15న అయ్యప్ప దీక్షాపరుల ఇరుముడి కార్యక్రమం జరిగింది. ఇరుముళ్ల అనంతరం దీక్షాపరులు శబరిమలకు వెళ్లి, ఈ నెల 21న తిరిగి దేవాలయానికి వచ్చారు. ఆలయ కింద భాగంలో ఉన్న హుండీ కనిపించకపోవడంతో కమిటీ సభ్యులు సీసీ కెమెరాలను పరిశీలించారు. వాటి ఆధారంగా హంసలదీవికి చెందిన తమ్ము వీరరాఘవయ్య ఈ దొంగతనానికి పాల్పడినట్లుగా గుర్తించినట్లు తెలిపారు. నిందితుడిని గురువారం అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరుపర్చినట్లు చెప్పారు. హుండీలోని నగదు కూడా రికవరీ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళా రైతులకు అవగాహన శిబిరం

మల్లంపల్లి(ఘంటసాల): చిరు ధాన్యాల విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా మహిళలకు ఆదాయం, ఆరోగ్యం వస్తాయని ఘంటసాల కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. ఘంటసాల కేవీకే ఆధ్వర్యంలో మండలం లోని మల్లంపల్లి పంచాయతీ శివారు బోళ్లపాడు అంగన్వాడీ కేంద్రంలో మహిళలకు చిరు ధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తుల గురించి గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జి.కృష్ణవేణి చిరుధాన్యాలతో తయారు చేసే విలువ ఆధారిత ఉత్పత్తులను, వాటిలో లభించే పోషక విలువలు, తయారీ విధానాన్ని వివరించారు. అనంతరం చిరుధాన్యాలతో కూడిన పిండి ప్యాకెట్లు మహిళలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బోళ్లపాడు గ్రామ మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిభా పోటీల్లో కొమ్మారెడ్డి విద్యార్థుల ప్రతిభ

బంటుమిల్లి: నియోజకవర్గ స్థాయిలో పెడనలో గురువారం జరిగిన చిత్రలేఖనం, వక్తృత్వ పోటీల్లో బంటుమిల్లి కొమ్మారెడ్డి పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. సీనియర్స్ విభాగంలో పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని ఎన్.గీతికప్రియ చిత్రలేఖనం పోటీలో ప్రథమస్థానం, జూనియర్స్ విభాగంలో ఆరవ తరగతి విద్యార్థి పి.ఫేమల్ శ్రీహిత్ వక్తృత్వ పోటీలో ప్రథమస్థానం సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ తెలిపారు. విద్యార్థులను ఆయనతో పాటు కరస్పాండెంట్ శోభ, హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.